క థా ని క

# కథానాయకుడి ఉత్తరం

"సులోచన"

సుందర్రామయ్య పళ్లు పటపట కొరుకుతున్నాడు. ఆయనకు కొడుకు రామచంద్రం మీద కోపం అంతకంతకూ ప్రజ్వరిల్లి పెచ్చు పెరిగిపోతూంది. కారణం: రాత్రినించీ యింటికి రాకపోవటమే. ఈ రాకపోవటం మరొకప్పుడు జరిగినట్లయితే ఆయన యింతగా ఆగ్రహపడి వుండేవాడు కాదు. తీరా పెళ్ళికూతురు తరఫువాళ్లు రేపు వొచ్చి అబ్బాయిని చూసి సంబంధం కుదుర్చుకుందామని కబురు పంపగా - రామచంద్రం ఆ రాత్రే మాయం కావటం ఒక్క సుందర్రామయ్యకే కాకుండా కుటుంబంలో అందరికీ కోపాన్ని లేపింది.

"వొస్తాడు లెండి! ఆ సమయానికి రాలేకపోతాడా?" అన్నది రామచంద్రం తల్లి.

సుందర్రామయ్య యింత ఎత్తున లేచాడు, భార్యమీద. "వొస్తాడు. చూద్దువు గానిగా అసలు నీవు వాణ్ణి యిల్లు కదలనిచ్చింది దేనికి? వెధవని. వాళ్లు వొచ్చేవేళ కూడా కావొస్తున్నది."

"సరే! బాగా నేవుంది, అయితే నన్నేం చేయమంటారండీ. వాణ్ణి బజారుకు పోనీయకుండా కావలి కాయమంటారా?" అన్నది రామచంద్రం తల్లి విసుక్కుంటూ.

"అఘోరించావులే వూరుకో" అన్నాడు సుందర్రామయ్య. కొడుకుమీదవున్న అక్కసు ఆయనలోని ప్రతి అవయవానికీ వేడిని కలిగిస్తున్నది.

సుందర్రామయ్య అటూయిటూ పచారుచేస్తున్నాడు. మెదడులో వివిధాలైన ఆలోచనలు మనస్సును మరీ చీకాకు పరుస్తున్నవి. పెళ్ళికూతురు తరఫువారు వస్తారు. అబ్బాయి లేడు-యేమనుకొంటారు. ఎంత నామర్దా. ఎక్కడకు వెళ్లాడని చెప్పడం? అందులో పెళ్ళి సంబంధం కనుక పూరూ పేరూ లేని యే వెధవ అయినా కాస్తంత అడ్డుపుల్ల వేసి నిక్షేపం వంటి సంబంధాన్ని కాస్త చెడగొట్టవచ్చు. ఆలసించితే అమృతం విషం. ఇటువంటివే మరికొన్ని ఆలోచనలు, సుందర్రావు మనస్సులో తారాడుతున్నయ్.

చిన్నకొడుకు సుబ్బారావు "యేదో కాగితం నాన్నా? అన్నయ్య గదిలో వుంది. అంతా అన్నయ్య దస్తూరి లాగా నేవుంది" అని కాగితం భద్రంగా నాన్న చేతికి అందించాడు.

సుందర్రావు గబగబా ఆదుర్దా అతిశయించగా, వ్రేళ్లు వొణుకుతుండగా, కళ్ళజోడు పెట్టుకొని కాగితం చదవటం మొదలెట్టాడు.

"ప్రియమైన తలిదండ్రులకు,

నన్ను మీరు కన్నారు. ఇప్పటి వరకూ పెంచారు. అందుకు దురదృష్టవశాత్తూ నేను కృతజ్ఞత చూపించలేక పోయినందుకు విచారిస్తున్నాను. కాని అందుకు అసలు హేతువు మీరే. మీరు నాకు బలవంతంగా రేపు సంబంధాన్ని కుదిర్చి వివాహం చేయబోతున్నారు. ఆపిల్ల మొహం నేనింత వరకు ఎరగను. నల్లనిదో తెల్లనిదో - గుణాలు ఎటువంటివో నాకు తెలీను. ఆ పిల్లమీద నాకు యిష్టం లేదు. అదీ కాక నేను ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించింది. మేమిద్దరమూ వివాహం చేసుకొని జీవితాన్ని సఫలం చేసుకోవాలనుకొన్నాము. అందువల్ల నేను యింటినించి లేచిపోతున్నాను మీరు నా కోసం ఆశే వెతకనవసరం లేదు. ఏమాత్రం లాభం లేదు.

ఇట్లు,
రామచంద్రం."

"ఓరి పిడుగా! ఎంతపని చేశాడు - ఎంత పనిచేశాడు! ఇంకేముంది కొంప నిలువునా మునిగినట్టే. వెధవ. ఎంత మోసం చేశాడు.

ఎన్ని గుండెలుండి ఈ పనిచేశాడు. ఇంకా ఎవరన్నా వింటే నా పరువేంకాను? కొంచెం సేపట్లో వొచ్చే ఆ సంబంధం వాళ్ళకి యేమని సమాధానం చెప్పేది. వెధవన్నర వెధవ! మాట మాత్రం నాతో అనకపోయెనే!" అని కేకలు వేస్తున్నాడు, సుందర్రామయ్య.

రామచంద్రం తల్లి వొచ్చింది "ఏంజరిగింది. ఏం జరిగింది" అంటూ.

"జరగవలసిందే, జరిగింది. అందరికీ బుద్ధి వచ్చే పనిచేసి వెళ్ళాడు. సుపుత్రరత్నం. ఇంక వొచ్చే అగౌరవం భరించు!" అని భార్యకేసి గుడ్లురిమి చూశాడు, సుందర్రామయ్య.

"అయ్యో, ఏమిటీ రాత! ఏం జరిగిందో చెప్పండి" అని మొత్తుకుంటున్నది రామచంద్రం తల్లి.

"ఇదుగో చూడు. లేఖ- వీడి మొఖానికి తోడు" అని భార్యమీద విసరి పారేశాడు, సుందర్రామయ్య.

రామచంద్రం తల్లి గబగబా చదువుకొని- కొడుకుమీద ప్రేమ పైకి వెల్లువలా వుబకగా- "అయ్యో, అబ్బాయీ! ఎంతపని చేసి వెళ్ళావురా! నాయనా! నిన్ను చూడందే ఎట్లా బ్రతికేమురా! ఇన్నాళ్ళు పెంచిన మాకు ఈ అగౌరవం తెస్తావట్రా" అని రాగాలు తీయనారంభించింది. కొంచెంసేపట్లో చుట్టుప్రక్కల యిళ్ల బాపతు వాళ్ళంతా వొచ్చారు "ఏం జరిగింది. ఏం జరిగింది" అనుకొంటూ.

సుందరరామయ్యకు గంగవెర్రు లెత్తినయ్. చిందులు త్రొక్కటం ఆరంభించాడు. ఈ సమయంలోనే పెళ్ళికూతురు తరఫువాళ్లు రావటం తటస్థించింది. వాళ్లు గాబరాపడ్డారు, ఈ దృశ్యంచూసి. అక్కడున్నవాళ్ళలో ఒక్కళ్లిద్దరు అననే అన్నారు "ఇంకా మీరు వొచ్చారు దేనికయ్యా. కొడుకు దేన్నో లేపుకుపోయి, ఉత్తరంముక్క వ్రాసి పొయ్యాడు. దాన్ని చూసుకొని తల్లి యేడుస్తున్నది." "సరే. మంచి శుభవార్తే" అనుకుంటూ వాళ్లు తిరిగి వొచ్చిన త్రోవనే వెళ్ళారు. సుందరరామయ్య యిదంతా చూస్తునే యేమి చేయలేనివాడై మెదలకండా వూరుకున్నాడు.

ఈవిషయం మరునాటికి దాదాపు వూరంతా ప్రాకిపోయింది. ఫలానా వారి అబ్బాయి ఫలానా ఘనకార్యం చేశాడని. సుందరరామయ్యని ఈ విషయమై చాలామంది పరామర్శ చేసి - కొడుకుమీద కోపాన్ని రగిలింపజేసి వెళ్ళారు.

ఆ రోజు సాయంకాలం రామచంద్రం యింటికి వొచ్చాడు. అందరూ రామచంద్రం వంక అదోవిధంగా చూసేసరికి రామచంద్రానికి అయోమయంగా తోచింది. తండ్రి కోపావేశంతో. "ఏం చేయనొచ్చావ్? ఇంకా బుద్ధి లేక" అన్నాడు.

రామచంద్రం నిస్తబ్ధుడయ్యాడు. "ఏమిటి అట్లా మాట్లాడుతావు నాన్నా!" అన్నాడు.

"ఏమీ తెలీదేం?" అని చరచరా ఇంట్లోకి వెళ్ళి ఉత్తరంముక్క తీసుకువచ్చాడు. రామచంద్రం చూశాడు. "ఏమిటిది?" అన్నాడు. పైగా సుందర్రామయ్యకు ఎక్కడమండాలో అక్కడే మండింది. "ఏం రాశావు? ఇంకా యింటికి యేముఖం పెట్టుకు తిరిగి వొచ్చావు?" అన్నాడు, సుందర్రామయ్య.

"పోనీ లెండి. ఎట్లాగొట్లావొచ్చాడు. వాణ్ణి మళ్ళా రెచ్చగొట్టటం దేనికి. తెలీకచేశాడు" అన్నది తల్లి.

రామచంద్రం వుండివుండి పకపక కడుపుబ్బిపోయేట్టు నవ్వాడు. అంతా తెల్లమొఖాలు వేసుకొని చూస్తున్నారు. రామచంద్రం నవ్వు ఆపుకొని అన్నాడు—

"ఏమిటనుకొన్నారు, ఆ ఉత్తరం? నేను వ్రాసేకథలో "రామచంద్రం" అనే పాత్ర తలిదండ్రులకు తను లేచిపోతూ ఉత్తరం వ్రాసి వెళ్ళిపోతాడు. అంతవరకు నేను కథ వ్రాసి, స్నేహితుడు పిలిస్తే వాళ్ళింటికి వెళ్లాను. అంతవరకు వ్రాసిన కథ కాగితాలని డ్రాయరుమీద పెట్టాను. ఆ వుత్తరం వ్రాసివున్న కాగితాన్ని చూసి మీరు యింతగా గాభరా చెంది వుంటారు."

సుందరరామయ్య, రామచంద్రం తల్లి ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నారు. ఇందువల్ల జరిగిన రాద్ధాంతం యింకా రామచంద్రానికి పూర్తిగా తెలీదు.